సాక్షి
నాగర్‌కర్నూల్

శుక్రవారం : 25 : అక్టోబర్ : 2024



సమస్యల వలయంలో..

వనపర్తిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి.

వివరాలు IIలో ▸



ప్రజల ఉసురు తీస్తారా..?

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ప్రజల ఉసురు తీస్తారా అంటూ ఆందోళన చేపట్టారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
36.5 /19.0

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రి వేళ చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

‘బస్ ఆన్ కాంటాక్ట్’ వినియోగించుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ నూతనంగా ప్రవేశ పెట్టిన ‘బస్ ఆన్ కాంటాక్ట్’ పథకాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని సంస్థ అభివృద్ధికి పాటుపడాలని నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్య గురువారం ప్రకటనలో కోరారు. వివాహాలు, ఇతర శుభకార్యాలు, యాత్రలకు వెళ్లేందుకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు ముందస్తు డిపాజిట్ లేకుండా 10 శాతం రాయితీతో అద్దెకు ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు పూర్తి వివరాలకు డిపోలో సంప్రదించాలని సూచించారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి : సీపీఎం



కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను పక్కాగా అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ కోరారు. గురువారం కల్వకుర్తి యూటీఎఫ్ భవనంలో వెల్దండ, ఊర్కొండ మండలాల కార్యవర్గ సమావేశం జరగగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఓసారి గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మహాసభలు నిర్వహించి పార్టీని పటిష్టపర్చుకొని ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. పంట రుణమాఫీని అర్హులైన రైతులకు వర్తింజేయాలని, రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యవర్గసభ్యులు ఆంజనేయులు, సి.ఆంజనేయులు, మల్లయ్య, పరశురాములు, బాల్‌రెడ్డి, బాలస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన



ఉప్పునుంతల: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేస్తే అధిక దిగుబడి సాధించడంతో పాటు ఒకేసారి పంట చేతికొచ్చి రెండో పంట సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గురువారం పాలెం కేవీకే ఆధ్వర్యంలో మండలంలోని కొరటికల్, తిప్పాపూర్, తాడూరులో అధిక సాంద్రత పత్తి సాగు ప్రయోజనాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. రైతులు ఎకరా పొలంలో 20 వేల మొక్కలు వచ్చేలా సాలు వెంట దగ్గర దగ్గర విత్తనాలు నాటుకుంటే మొక్కలు ఏపుగా పెరగకుండా తక్కువ ఎత్తులోనే కాయలు ఒకేసారి వచ్చి తక్కువ వ్యవధిలోనే పంట పూర్తవుతుందని వివరించారు. అదే పొలంలో యాసంగిలో రెండో పంట వేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పద్ధతికి మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంత నేలలు అధిక సాంద్రత పత్తి సాగుకు అనుకూలమైనవని.. ఈ పద్ధతిని అనుసరించి ప్రయోజనం పొందాలన్నారు. అదేవిధంగా పత్తిలో సస్యరక్షణ చర్యలు, యాసంగి పంటలుగా సాగుచేసిన వేరుశనగ, మినుము, పెసర, మొక్కజొన్న పంటల సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా. రాజశేఖర్, డా. ఓశైల, డా. ఆదిశంకర్, డా. రామకృష్ణ, యువ శాస్త్రవేత్తలు రఘువరణ్‌సింగ్, రాజేష్, జ్ఞానేశ్వర్, హరీశ్ పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గీత



నాగర్‌కర్నూల్ రూరల్: ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగర్‌కర్నూల్‌కు చెందిన కందికొండ గీత ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో ఈ నెల 21 నుంచి 23 వరకు ఐద్వా రాష్ట్ర మహాసభలు కొనసాగగా గురువారం రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా హక్కులు, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. సమాజంలో మహిళలను చిన్నచూపు చూస్తున్నారని, అఘాయిత్యాలు, దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఈ తరుణంలో మహిళలను చైతన్యవంతం చేస్తానని పేర్కొన్నారు.

శిశు సంజీవని

ప్రాణాలు నిలుపుతున్న నియోనేటల్ కేర్ అంబులెన్స్



నియోనేటల్ కేర్ అంబులెన్స్

- నవజాత శిశువులకు మెరుగైన వైద్యం
- వాహనంలోనే మినీ ఐసీయూ
- పేద తల్లిదండ్రులకు తగ్గుతున్న ఆర్థిక భారం

అచ్చంపేట రూరల్: బిడ్డ పుట్టగానే తల్లిదండ్రులు ఎంతగానో మురిసిపోతారు.. అదే బిడ్డకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన పని.. అలాంటి వారికి భరోసానిస్తోంది నియోనేటల్ కేర్ అంబులెన్స్ వాహనం. ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది చిన్నారులకు ఈ వాహనం అపర సంజీవనిలా మారింది. పట్టణాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి. ఈ బాధను తప్పించేందుకు, శిశు మరణాలను తగ్గించేందుకు గత ప్రభుత్వం గతేడాది ఆగస్టు 21న నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది.



వాహనంలో చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ఐదు..

నవజాత శిశువు సంరక్షణలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గద్వాలకు ఒకటి, మహబూబ్‌నగర్‌కు 2, నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటకు ఒకటి, వనపర్తి జిల్లాకు ఒక్కో వాహనం చొప్పున మొత్తం ఐదు వాహనాలు అందించింది. అత్యవసర వైద్యసేవలు అందించి వేలాది మంది శిశువుల ప్రాణాలు రక్షించడంలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 2,640 మంది చిన్నారుల ప్రాణాలు కాపాడారు.

108కు కాల్ చేస్తే సరి..

నవజాత శిశు మరణాలు తగ్గించడంలో నియోనేటల్ వాహనం ఎంతో ఉపయోగపడుతుంది. అత్యవసర సమయంలో 108కు కాల్ చేస్తే చెప్పిన స్థలానికి చేరుకొని శిశువుకు అవసరమైతే వెంటిలేటర్ కూడా పెట్టి కావాల్సిన వైద్య సేవలు అందిస్తూ ఆస్పత్రులకు చేరుస్తున్నారు. నవజాత శిశువులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. మరింత మెరుగైన వైద్యం కోసం నీలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. దీంతో కన్నవారికి ఆర్థిక భారం తగ్గడంతో పాటు అంబులెన్స్‌లోనే వైద్యసేవలు అందుతాయి.

శిశు మరణాల రేటు తగ్గింది..



అత్యాధునిక నియోనేటల్ వాహనాలు అందుబాటులోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గింది. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా ఆస్పత్రులకు సకాలంలో తరలిస్తున్నాం. అవసరమైతే హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నాం. శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాసుపత్రులకు పంపిస్తున్నాం. వాహనంలో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లిగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం. ఈ వాహనాలు అందుబాటులోకి రావడంతో పేద తల్లిదండ్రులకు ఆర్థికభారం తగ్గడంతో పాటు మానసిక ఆందోళన తప్పుతుంది.

– రవికుమార్, ప్రోగ్రాం మేనేజర్, మహబూబ్‌నగర్

అందించే సేవలు..

అప్పుడే పుట్టిన శిశువు నుంచి నెల వయసున్న పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. నవజాత శిశువులు ఎక్కువగా శ్వాస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. సకాలంలో పెద్దాసుపత్రులకు తరలించాలంటే అంబులెన్స్‌లోనే మినీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) అవసరం. అదే విభాగాన్ని అధునాతన పరికరాలతో 108 నియోనేటల్ వాహనాన్ని రూపొందించారు. కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడి, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయటి నుంచి శ్వాస అందించే బ్యాగా మాస్క్ డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో వాహనంలో నిరంతరం అందుబాటులో ఉండేలా ఇద్దరు చొప్పున ఈఎంఆర్‌లు, మరో ఇద్దరు పైలెట్లను నియమించారు.

వాహనాల వారీగా సేవలు పొందిన శిశువులు

వాహనం	2023 (ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు)	2024 (జనవరి నుంచి ఇప్పటి వరకు)
మహబూబ్‌నగర్-1	129	547
మహబూబ్‌నగర్-2	82	351
గద్వాల	131	388
అచ్చంపేట	136	432
వనపర్తి	86	358

‘ఎల్‌ఆర్‌ఎస్’ స్క్రూట్నీ త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూట్నీ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట పరిధిలో 44,054, గ్రామీణ ప్రాంతాల నుంచి 23,255, మొత్తం 67,309 దరఖాస్తులు రాగా.. మండలాల వారీగా పరిష్కారానికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సూక్రటినీ ప్రక్రియ 4 దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, క్షేత్రస్థాయి సర్వే ధ్రువీకరణ ప్రక్రియ పక్కాగా జరగాలని ఆదేశించారు. క్రమబద్ధీకరణ ఫీజు వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేసి త్వరగా చెల్లించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీఓ రామ్మోహన్‌రావు, నీటిపారుదలశాఖ ఈఈ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి పుర కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీఓలు, పుర టౌన్ ప్లానింగ్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 8న బీసీ కమిషన్ చైర్మన్ సమావేశం

వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో నవంబర్ 8న మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు ఉదయం 10 వరకు అక్కడికి చేరుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ సామాజికవర్గాల వారు, ప్రజాప్రతినిధులు, ఆసక్తిగలవారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా అందజేయాలని సూచించారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం..

కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా ఉంటామని.. అన్ని వసతులతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం బోడబండతండా, అంజనగిరి, వడ్డెర గుడిసెలు, ఎర్రగట్టు బొల్లారం, దూల్యానాయక్ తండాల్లో ఆయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. మంత్రి జూపల్లి కృష్ణారావు సూచన మేరకు గ్రామాలను సందర్శించామని, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ప్రభుత్వ పాఠశాల, ఆస్పత్రి, విశాలమైన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. తాము ఇళ్లు కట్టుకునేందుకు స్థలాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారుల నుంచి ఇబ్బందులు లేకుండా చూడాలని, ముంపులో కోల్పోయిన భూమికి భూమి ఇవ్వాలని ఎర్రగట్టు బొల్లారం ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు. అక్కడే ఉన్న ఫారెస్టు అధికారులతో ఈ విషయంపై చర్చించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంతు నాయక్, నిర్వాసితులు ఉన్నారు.

బకాయి బిల్లులు త్వరలోనే చెల్లిస్తాం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, రైతులు

- ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష

కొల్లాపూర్ రూరల్: బకాయి బిల్లులను త్వరలోనే చెల్లిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో కొల్లాపూర్ నియోజకవర్గ ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని ఇరుశాఖల అధికారులకు సూచించారు. పనుల్లో వేగం పెంచాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పాత లైన్లు పునరుద్ధరించాలని, వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, విద్యుత్‌శాఖ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, ఎస్‌ఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం అందించాలి..

అచ్చంపేట రూరల్: నక్కలగండి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలంటూ గురువారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో రైతులు కలిశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2004 జలయజ్ఞం కార్యక్రమంలో ఎల్ఎల్‌బీసీ సొరంగాన్ని ప్రారంభించారన్నారు. నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణంలో చాలామంది పేద రైతులు భూములు కోల్పోవాల్సి వచ్చిందని.. పరిహారం అందించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని వివరించారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రికి పలు సమస్యలు విన్నవించారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

బల్మూర్: మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చెరువులు, కుంటల్లో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని గోదల్, బల్మూర్ చెరువుల్లో అధికారులు, మత్స్యకారులతో కలిసి చేప పిల్లలను వదిలారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలోని 10 మత్స్యకార సొసైటీల పరిధిలో ఉన్న 102 చెరువులు, కుంటల్లో 6.53 లక్షల చేప పిల్లలను ఒకేరోజు వదిలామన్నారు. నియోజకవర్గంలోని లింగాల, అమ్రాబాద్, పదర, చారకొండ, అచ్చంపేట మండలాల్లోని చెరువులు, కుంటల్లో రెండ్రోజుల్లో చేప పిల్లలు వదులుతామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ డా. రజని, ఎంపీడీఓ రాఘవులు, మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మత్స్యకార సొసైటీ జిల్లా నాయకులు జంగయ్య, వెంకటయ్య, చిదుత కేశవులు, అశోక్, మాజీ సర్పంచ్‌లు నర్సింగ్‌రావు, రాంప్రసాద్‌గౌడ్, శైలేష్, కాశన్న యాదవ్, శ్రీనివాసులు, ఖదీర్, మత్స్యశాఖ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.



నల్ల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు, మత్స్యకారులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గిరికుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే మోసపోకుండా ఉండగలమని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు స్పందించవద్దని, సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకు అధికారులమంటూ ఎవరైనా ఫోన్‌చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. జిల్లాలో జాబ్, ఇన్‌వెస్ట్‌మెంట్, అడ్వర్‌టైజ్‌మెంట్, క్రెడిట్‌కార్డు ఫ్రాడ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రవికుమార్, చిరంజీవి, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

29న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని స్టేడియంలో ఈనెల 29వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14, అండర్–17 విభాగాల బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే వారు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం ఖలీల్ 9885345211 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు పాలమూరులో ఐటీ మంత్రి పర్యటన

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం పాలమూరులో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు కొమ్మిరెడ్డిపల్లి నుంచి షేక్‌పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పిల్లలమర్రి రోడ్డులోని బాలికల ఐటీఐ కళాశాలలో ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు) సెంటర్ కోసం శంకుస్థాపన, డైట్ కళాశాల ఆవరణలో టాస్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన, మధురానగర్‌లోని రెడ్డి బాలికల హాస్టల్ వద్ద మొదటి శిక్షణ కార్యాలయం ప్రారంభోత్సవం, దివిటిపల్లిలో ఐటీ టవర్ సందర్శన, మధ్యాహ్నం 4 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

క్రమబద్ధీకరణ ఎప్పుడో..?

ఐకేపీ ఉద్యోగులకు చాలీచాలని వేతనాలు



జిల్లా సమాఖ్య సమావేశంలో చర్చించుకుంటున్న సమాఖ్య సభ్యులు (ఫైల్)

- దుర్భర పరిస్థితుల్లో కుటుంబాలు
- 16 ఏళ్లుగా తప్పని వెట్టిచాకిరి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 217 మంది సిబ్బంది

జిల్లాల వారీగా సిబ్బంది ఇలా..

జిల్లా	అకౌంటెంట్లు	కంప్యూటర్ ఆపరేటర్లు	అటెండర్లు
మహబూబ్‌నగర్	15	10	15
నాగర్‌కర్నూల్	21	17	21
గద్వాల	12	2	13
వనపర్తి	15	15	14
నారాయణపేట	20	8	19

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లను ప్రభుత్వం గుర్తించకపోవడంతో చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు మండల కేంద్రాల్లో సెర్ప్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో ఏపీఎం, సీసీలతో సహా అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించింది. ఇందులో పనిచేసే ఏపీఎం, సీసీలు, సీఏలను గుర్తించిన ప్రభుత్వం అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల, అటెండర్లను విస్మరించడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబపోషణ భారంగా మారిందని.. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

21 రకాల సంక్షేమ కార్యక్రమాలు..

మహిళా సాధికారత, గ్రామీణ స్థాయిలో పేదరిక నిర్మూలన తదితర ముఖ్యమైన పథకాలను ఆర్థికపరంగా రికార్డులను జాగ్రత్తగా నిర్వహిస్తున్నారు. పుస్తక నిర్వహణ, ఆడిటింగ్ ఎప్పటికప్పుడు వాటికి సంబంధించి అన్ని రకాల కంప్యూటర్ ఆధారిత రిపోర్టులు, లబ్ధిదారుల వివరాలు జీవనోపాధి కోసం ఇచ్చే జీవనోపాధి వివరాలతో పాటు 21 రకాల సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. వీటి వివరాలను కూడా జిల్లాస్థాయి (డీఆర్‌డీఓ)కు అందిస్తారు. వీరు లేనిదే ఐకేపీ కార్యాలయాల్లో ఫైల్ కదలడం కష్టం. వరిధాన్యం కొనుగోలు వివరాలు, రైతులకు పంట డబ్బుల చెల్లింపులు తదితర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేస్తే తప్ప పని పూర్తి కాని పరిస్థితి ఉంటుంది. వీరికి నెలకు రూ.8–10 వేల వరకు వేతనం పొందుతున్నారు. 16 ఏళ్లుగా పని చేస్తున్నా ప్రభుత్వం వీరిని గుర్తించడం లేదు.



జిల్లా మహిళా సమాఖ్య భవనం

న్యాయం చేయాలి..



ప్రస్తుతం మేము సెకండ్ గ్రేడ్ సీబీఓ, సిబ్బందిగా కొందరి అధికారుల దయపై ఆధారపడి దినదిన గండంగా విధులు నిర్వహిస్తున్నాం. జిల్లా, మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న మా స్థితిగతులను దయతో పరిశీలించి ఉద్యోగ భద్రత కల్పించాలి. గత ప్రభుత్వం నుంచి ఎదురుచూస్తున్నాం. కొత్త ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం చేయాలి.

– శ్రీనివాస్, అకౌంటెంట్, జిల్లా మహిళా సమాఖ్య, మహబూబ్‌నగర్

మమ్మల్ని గుర్తించట్లేదు..



16 సంవత్సరాల నుంచి మాకు ఉద్యోగ భద్రత కలుగుతుందేమోనని ఎదురు చూస్తున్నాం. మా జీవితమంతా ఎదురు చూపులతోనే గడిచిపోతోంది. పేదల కోసం ఆలోచించే ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లను అందరినీ గుర్తించి వేతనాలు పెంచింది. కానీ, మమ్మల్ని గుర్తించట్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మమ్మల్ని గుర్తించి వేతనాలు పెంచాలి.

– అలివేలు, జిల్లా కోశాధికారి జిల్లా, మండల సమాఖ్య ఉద్యోగుల సంక్షేమ సంఘం

గుర్తింపు లేదు..



మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. మహిళల రుణాలు, స్త్రీనిధి చెల్లింపులు, ధాన్యం కొనుగోలు వివరాలు ఇలా ప్రతీది కంప్యూటర్‌లో నమోదు చేస్తే తప్ప పని కాని పరిస్థితి. తెరవెనక మేం లేనిదే గ్రామీణ పేదరిక నిర్మూలన వ్యవస్థ నడవడం కష్టం. ఇంత కష్టపడుతున్నా మాకు తగిన గుర్తింపు లేదు.

– ఫారుక్, జిల్లా అధ్యక్షుడు, జిల్లా, మండల సమాఖ్య ఉద్యోగుల సంక్షేమ సంఘం, పాలమూరు

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి


సుజాత (ఫైల్)

కేటీదొడ్డి: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు రోడ్డుపై అదుపుతప్పి కిందపడటంతో మృతిచెందిన సంఘటన మండలంలోని చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని నందిన్నె గ్రామానికి చెందిన పోస్ట్‌మ్యాన్ సుజాత(46) నందిన్నె నుంచి మాచర్లకు పోస్టాఫీసు పని నిమిత్తం మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వెళ్తుండగా కుచినెర్ల శివారులో అదుపుతప్పి పడింది. దీంతో గమనించిన స్థానికులు రాయిచూర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గంగాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన గుద్దేటి గోపాల్(38) బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గోపాల్‌ను రెండు నెలల క్రితం తొలగించినట్లు తెలిపారు. ఈ కారణంగా భార్యాభర్తల మధ్య తరుచు గొడవలు చోటు చేసుకుని ఆత్మహత్యకు దారి తీసినట్లుగా అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ కొండచిలువ మృతి


మృతి చెందిన కొండచిలువ

కొత్తకోట రూరల్: భారీ కొండచిలువ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం రామకృష్ణాపురం గ్రామ శివారులోని రామన్‌పాడ్ ఎడమ కాల్వ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్తుండగా.. కాల్వ సమీపంలో భారీ కొండ చిలువ మృతిచెంది కనిపించింది. కొండ చిలువ దాదాపు 10 అడుగుల పొడవు ఉందని తెలిపారు. ఎవరైనా చంపేసి ఉండవచ్చని లేదా కాల్వలో చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

మళ్లీ మొసలి ప్రత్యక్షం


గోపాల్‌పేట అమ్మచెరువు ఒడ్డుపై ఉన్న మొసలి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని అమ్మచెరువులో కొన్ని రోజులుగా సంచరిస్తున్న మొసలి గురువారం మళ్లీ ప్రత్యక్షమైంది. చెరువు మధ్యలో ఉన్న గడ్డపై మొసలి కనిపించడంతో స్థానిక యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. నివాసగృహాలకు సమీపంలోని చెరువులో మొసలి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వీలైనంత తొందరగా మొసలిని బంధించి ఇతర ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

సమస్యల వలయంలో..

వనపర్తి ఇంజినీరింగ్ కళాశాల

- రెండు చోట్ల తరగతుల నిర్వహణ
- అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- ముందుకు సాగని శాశ్వత భవన నిర్మాణం



పీజీ కళాశాలలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ కళాశాల

మొత్తం విద్యార్థులు	గ్రూపులు	రెగ్యులర్ ప్రొఫెసర్లు	గెస్ట్ స్టాఫ్
724	ఈసీఈ, సివిల్, ఈఈఈ, సీఎస్ఎం, సీఎస్ఈ	నలుగురు	31 మంది


సివిల్, సీఎస్ఈ కోర్సుల బోధన జరిగే అద్దె భవనం


క్లాస్‌రూం పక్కనే ఉన్న టాయిలెట్లు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కళాశాలకు అనువైన భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 2022లో ఐదు గ్రూపులు, 118 మంది విద్యార్థులతో ఇంజినీరింగ్ కళాశాలను పీజీ కళాశాల భవనంలో తాత్కాలికంగా ప్రారంభించారు. ఇక్కడ మొత్తం 20 గదులు ఉండగా.. ఇంజినీరింగ్ కళాశాలకు 8 గదులను మాత్రమే కేటాయించారు. మొదటి సంవత్సరం ఐదు కోర్సులకు చెందిన 500 మంది పైచిలుకు విద్యార్థులకు గదులు సరిపోయాయి. 2వ ఏడాది రెగ్యులర్ విద్యార్థులతో పాటు పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఈసెట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాల పొందడంతో తరగతి గదులు ఏమాత్రం సరిపోవడం లేదు. అదనంగా గదులను వాడుకుందామంటే పీజీ కళాశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఈ క్రమంలో కళాశాలకు సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న సీడీడీపీ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఆ భవనంలో ఈసీఈ 2, 3, సివిల్ 2, 3 సంవత్సరాల విద్యార్థులు చదువుతున్నారు. అందులో క్లాస్‌రూమ్‌ల పక్కనే మూత్రశాల ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మంచినీటి కొళాయిలు అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థినులు మూత్రశాలకు వెళ్లేటప్పుడు పైఫ్లోర్ నుంచి కనిపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. అద్దె భవనానికి ప్రహరీ కూడా లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఆయా సమస్యలపై ఇటీవల విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. కళాశాలలో ల్యాబ్ సౌకర్యం సైతం అరకొరగా ఉంది.

నత్తనడకన భవన నిర్మాణం..

నాగవరం శివారులోని 45 ఎకరాల విస్తీర్ణంలో రూ. 4.17 కోట్లతో రెండేళ్ల క్రితం చేపట్టిన కళాశాల భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కొన్ని రోజుల్లో పనుల్లో ఎలాంటి కదలిక కనిపించడం లేదు. ప్రస్తుతం కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 164, సెకండ్ ఇయర్‌లో 269, థర్డ్ ఇయర్‌లో 290 మంది విద్యార్థులు ఉ న్నారు. అసౌకర్యాల నుంచి బయటపడేందుకు గాను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల కేటాయింపునకు జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ చేసిన ప్ర యత్నాలు ఫలించడం లేదు. పీజీ కళాశాలకు స మీపంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో అదనపు గదులున్నా.. వాటి కేటాయింపునకు కళాశాల ప్రిన్సిపాల్ నిరాకరించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటిని కేటాయిస్తే సమస్య కొంత తీరుతుంది.

రవాణా కష్టాలు..

విద్యార్థులకు రెండు చోట్ల ఉన్న తరగతులు నిర్వహిస్తుండటంతో రవాణా కష్టాలు తప్పడం లేదు. రోడ్డు సమీపంలోనే కళాశాల భవనాలు ఉన్నప్పటికీ.. బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు నడిచి వెళ్లాల్సి వస్తోంది. మరోవైపు మూడు చోట్ల వసతిగృహాలను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేటు ఆస్పత్రి భవనంలో 124 మంది విద్యార్థినులకు వసతి కల్పిస్తుండగా.. వేర్వేరు చోట్ల ఉన్న రెండు భవనాల్లో 173 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. మిగతా 373 మంది విద్యార్థులు ప్రైవేటు హాస్టళ్లలో అభద్రత నడుమ వసతి పొందుతున్నారు.

సీఎంఓ ఆరా..

జేఎన్‌టీయూలో వసతుల లేమిపై విద్యార్థినులు చేపట్టిన ఆందోళనపై గురువారం సీఎంఓ కార్యాలయం ఆరా తీసింది. అయితే కళాశాల భవన నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదని.. విద్యార్థులు లేవనెత్తిన సమస్యల్లో 80 శాతం వాస్తవమేనని.. విద్యార్థుల స్వీయ నిర్ణయంతోనే ఆందోళన చేపట్టారని వివరించినట్లు తెలిసింది. సొంత భవనంతోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. రెండు చోట్ల తరగతుల నిర్వహణతో విద్యార్థులకు రవాణా కష్టాలు తీవ్రంగా ఉన్నాయని.. కళాశాల వద్ద బస్సులు ఆపడం లేదని.. సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. 350 మంది వరకు విద్యార్థులు ప్రభుత్వ అధీనంలోని హాస్టళ్లలో ఉన్నారని.. మిగతా వారు అసౌకర్యాల పేరుతో ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నట్లు వివరించారు. సీఎంఓ కార్యాలయం ఆరా తీసిన అంశాన్ని జేఎన్‌టీయూ అధికారులు ధ్రువీకరించడంతో పాటు హైదరాబాద్ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు సమస్యలను వివరించినట్లు తెలిసింది.

ప్రాక్టికల్స్ చేయించడం లేదు..



నేను మూడేళ్లుగా ఇక్కడ చదువుతున్నాను. సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రాక్టికల్స్‌కు సంబంధించి ఎలాంటి ప్రయోగ పరీక్షలు లేవు. మాకు నాలెడ్జ్ ఎలా వస్తుంది. గట్టిగా అడిగితే ప్రైవేటు కాలేజీకి తీసుకెళ్తున్నారు. కానీ మమ్మల్ని ప్రయోగ పరికరాలను ముట్టుకోనివ్వడం లేదు. హాస్టల్‌లో భోజనం బాగాలేక ఫుడ్‌పాయిజన్ అవుతుంది. సరిపడా తాగునీరు కూడా అందుబాటులో లేదు.
– అపర్ణ, థర్డ్ ఇయర్ విద్యార్థిని

గంట గంటకు మారుతున్నాం



ప్రతి పీరియడ్‌కు తరగతి మారాల్సి వస్తోంది. ఒక ఫస్ట్ ఇయర్‌కు తప్పితే ఏ బ్రాంచీకి ల్యాబ్‌లు లేవు. రవాణా సౌకర్యం లేకపోవడంతో అక్కడికి, ఇక్కడికి నడిచి వెళ్లేందుకు 20 నిమిషాల సమయం పడుతుంది. లైబ్రరీ సౌకర్యం కూడా కల్పించడం లేదు.
– కవిత, విద్యార్థిని

తప్పనిసరి స్థితిలో ప్రైవేటుకు..



ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటే భద్రత ఉంటుంది. కానీ అసౌకర్యాల నడుమ ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాను. కళాశాలలో విద్యార్థులకు అనువైన వాతావరణం లేదు. చదువుకునేందుకు వీలైన వాతావరణం ఉండాలంటే సొంత భవన నిర్మాణం ముఖ్యం.
– సుస్మిత, విద్యార్థిని

అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం



విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కళాశాలకు ప్రభుత్వ భవనాలను సైతం వినియోగించుకోవాలని అన్వేషిస్తున్నాం. సమస్య తీవ్రతను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కళాశాలకు కొంత దగ్గరలో ఉందని సీడీడీపీఏ భవనం తీసుకున్నాం. జిల్లా కేంద్రంలో బోధనకు అనువుగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు చూయిస్తే అసౌకర్యాల నుంచి కొంత బయటపడతాం. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.
– రాంనరేష్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ, వనపర్తి

అండర్-23 క్రికెట్ టోర్నీ .. నారాయణపేట ఘన విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని క్రికెట్ మైదానంలో అండర్-23 లీగ్ కమ్ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో నారాయణపేట 9 వికెట్ల తేడాతో కొడంగల్‌పై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కొడంగల్ 16.5 ఓవర్లలో 35 పరుగులకే ఆలౌట్ అయింది. అద్నాన్ కేవలం 5 బంతుల్లో ఒక్క పరుగు ఇవ్వకుండా మూడు వికెట్లు తీయడం విశేషం. మిగతా బౌలర్లు రోహన్ 3, ఎజాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నారాయణపేట జట్టు 6.1 ఓవర్లలో వికెట్ కోల్పోయి 36 పరుగులు చేసింది. అద్నాన్ 17, తరుణ్ 12 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. శుక్రవారం వనపర్తి-నాగర్‌కర్నూల్ జట్లు తలపడనున్నాయి.

క్రీడాజట్లను అభినందించి ఒలింపిక్ అధ్యక్షుడు

అంతకుముందు నారాయణపేట-కొడంగల్ జట్టు క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్ అభినందించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో ప్రతిభచాటి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా, ఒలింపిక్ సంఘం సభ్యులు సోహైల్ ఉర్ రెహెమాన్, అంపైర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు

అడ్డాకుల: మండలంలోని రాచాలలో వచ్చేనెల 3వ తేదీ నుంచి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలికలు, అండర్-19 బాలుర కబడ్డీ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ వి.కురుమూర్తి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణపై జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఉపాధ్యాయులతో నిర్వహణ కమిటీల ఏర్పాటు కోసం ఈ నెల 28న మరోసారి సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రజల ఉసురు తీస్తారా..?

- పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ పనుల అడ్డగింత
- ఫ్యాక్టరీ స్థలం వద్ద పలు గ్రామాల రైతుల బైఠాయింపు.. ఆందోళన


పెద్దధన్వాడలో ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ బైఠాయించిన రైతులు

రాజోళి: ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల విషపూరితమైన వాయువులు వెలువడి పొలాలు నాశమవుతాయని, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఇవన్నీ తెలిసి కూడా గ్రామాలకు సమీపంలో ఫ్యాక్టరీ ఎలా పెడతారని, ప్రజల ఉసురు తీస్తారా అని పెద్దదన్వాడ ప్రజలు మండిపడ్డారు. మండలంలోని పెద్దధన్వాడలో గాయిత్రీ సహజ ఇందన కర్మాగారం ఆధ్వర్యంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నెలకొల్పుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల పనులు ప్రారంభించేందుకు యత్నించగా అడ్డుకున్నారు. గురువారం మళ్లీ పనులు ప్రారంభం కావడంతో, విషయం తెలుసుకున్న పెద్దదన్వాడ, చిన్నదన్వాడ, మాన్‌దొడ్డి, నసనూర్,తుమ్మిళ్ల తదితర గ్రామాల రైతులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. టిప్పర్లు, ఇతర వాహనాలతో


ఎక్కడికక్కడే నిలిచిన టిప్పర్లు, ఇతర వాహనాలు

చేస్తున్న పనులను నిలిపేసి అక్కడే బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జగదీష్ అక్కడకు చేరుకుని ఎలాంటి ఘర్షణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ నుండి వెళ్లాలని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేసుకోవాలని ఆయన సూచించారు. అయినప్పటికీ రైతులు వినిపించుకోలేదు. 15 రోజుల దాకా ఎలాంటి పనులు చేయమని చెప్పి, ఫ్యాక్టరీకి సంబంధించిన అనుమతుల జిరాక్సులు ఇస్తామని చెప్పి, ఈ రోజు అవేవి మాకు చూపించకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అసలు ఇప్పటిదాకా అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారనే విషయాన్ని గ్రామస్తులకు తెలియకుండా గోప్యంగా ఉంచారని, ఫ్యాక్టరీ కడతామంటే ఎవరూ ఒప్పుకోరని రైతులు అన్నారు.

గ్రామస్తులతో చర్చించిన తర్వాతనే..

విషయం తెలుసుకున్న తహసీల్దార్ పి.రామ్మోహన్, శాంతినగర్ సర్కిల్ సీఐ టాటాబాబు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ విషయంలో తమకు తెలియకుండా తమ గ్రామంలో ఎలా పనులు చేపడతారని రైతులు అన్నారు. తప్పకుండా అధికారుల సమక్షంలో ఫ్యాక్టరీ యామాన్యంతో రైతులకు మాట్లాడే అవకాశం కల్పిస్తామని, రైతులు దీన్ని గమనించాలని వారు రైతులకు చెప్పారు. అనంతరం ఫ్యాక్టరీ వారితో ఫోన్‌లో మాట్లాడుతూ.. రైతులకు,గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా వారి సమక్షంలో ఫ్యాక్టరీకి సంబంధించిన అంశాలపై చర్చించాలని, అప్పటివరకు పనులు నిలిపేయాలని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా ప్రజలతో చర్చించేందుకు సిద్ధమని చెప్పడంతో రైతులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న సీఈ రామసుబ్బారెడ్డి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద విద్యుత్ ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను గురువారం సీఈ రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోని కేటీపీఎస్ 5, 6, కేటీపీఎస్ 7, జూరాల, విద్యుత్ సౌధ, కేటీపీపీ ఛల్‌పూర్ మొత్తం ఆరు డిస్కంలకు సంబంధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు జెన్‌కో డీఈ పవన్‌కుమార్ తెలిపారు. జూరాల ప్రాజెక్టు దిగువన ఉన్న రేవులపల్లి పీజేపీ క్యాంపులోని జెన్‌కో డీఏవీ పాఠశాల ఆవరణలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెన్‌కో సీఈతోపాటు ఎస్ఈలు సూరిబాబు, సురేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ నెల 27 వరకు నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొనే ప్రతి జట్టు, ప్రతి క్రీడా ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయన్నారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో జెన్‌కో డీఈలు పవన్‌కుమార్, రూపేష్, వెంకట్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఏఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యుత్ ఉద్యోగులు

ఒకే గ్రామంలో ఐదు ఇళ్లకు కన్నం

నారాయణపేట: ఒకే గ్రామంలో రాత్రికి రాత్రి ఐదు ఇళ్లకు కన్నం వేసిన దొంగలు రెండుచోట్ల బంగారం, నగదు చోరీ చేశారు. మరో మూడు ఇళ్లలో ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. వివరాలిలా.. మండలంలోని కొల్లంపల్లికి చెందిన గొల్ల ధన్‌రాజ్ తన భార్యతో కలిసి మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అయితే బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి రెండున్నర తులాల బంగారం, 12తులాల వెండితో పాటు రూ.85 వేలు చోరీ చేశారు. అదేవిధంగా పక్కనే ఉన్న నడిమింటి ఆశప్ప రాత్రి ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లగా వారి ఇళ్లలో చొరబడి అరతులం బుట్ట కమ్మలు, రూ. 20వేలు నగదు దొంగలించారు. అదేవిధంగా చింతలి పోలప్పతోపాటు కుర్వగేరిలో మరోరెండు ఇళ్లతాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లారు. ఇంట్లోని బీరువాలు పగలగొట్టి వస్తువులు చిందరివందర చేసి వెళ్లారు. ఈ సంఘటనపై రూరల్ ఎస్ఐని సంప్రదించగా ఆయన కోర్టు పనిపై వెళ్లినట్లుతెలిపారు. ఐదు మందిలో కేవలం బాధితుడు దన్‌రాజ్ మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మార్కెట్‌లోకి సీఎన్‌జీ బైక్


సీఎన్‌జీ ఫ్రీడమ్ బైక్‌ను ఆవిష్కరిస్తున్నడీఎస్పీ వెంకటేశ్వర్లు

పాలమూరు: బజాజ్ కంపెనీ నుంచి కొత్తగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టిన సీఎన్‌జీ ఫ్రీడమ్ బైక్‌ను గురువారం జిల్లా కేంద్రంలోని హరూన్ బజాజ్ షోరూంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరూర్ బజాజ్ ఎండీ ఇసాక్ మాట్లాడుతూ.. ఈ బైక్‌లో 2 కిలోల సీఎన్‌జీ నింపుకొంటే, వంద కిలోమీటర్ల మైలేజ్ వస్తోందన్నారు. కస్టమర్‌కు ఒక కి.మీ. ఒక రూపాయిలోపు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో రూ. 110 వెచ్చించి లీటర్ పెట్రోల్ పోయిస్తే.. 50 నుంచి 60 కి.మీ. మాత్రమే మైలేజ్ వస్తుందన్నారు. ఈ పద్ధతిన కస్టమర్‌కు రూ. 2 చొప్పున కిలోమీటర్‌కు ఖర్చు అవుతుందన్నారు. సీఎన్‌జీ ఫ్రీడమ్ బైక్‌తో పొల్యూషన్ కంట్రోల్ కావడంతో పాటు మైలేజ్ కూడా అధికంగా ఉంటుందన్నారు. ఈ బైక్ ధర రూ. 95వేల నుంచి రూ. లక్ష 10వేల వరకు ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 11 బైక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి, మెగా సీటీ గ్యాస్ కంపెనీ ఇన్‌చార్జి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై తరలిన పీయూ జట్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు గురువారం చెన్నై బయలుదేరి వెళ్లారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి జరిగే బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ట్రాక్‌సూట్‌లు, టీం యూనిఫాంలు అందజేశారు. పీడీ శ్రీనివాస్, కోచ్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, శారద, మన్యం ఉన్నారు.


పీయూ జట్టుతో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్

3న ప్రొఫెసర్ సాయిబాబా స్మారక సభ


మాట్లాడుతున్న రాఘవాచారి

పాలమూరు: ప్రొఫెసర్ సాయిబాబా స్మారక సభను నవంబర్ 3న పాలమూరు పట్టణంలో నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ భవన్‌లో గురువారం వామపక్ష పార్టీలు, ప్రజాస్వామిక, మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవాచారితో పాటు టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ.. పౌర హక్కుల నేత, ప్రముఖ ప్రజాస్వామ్యవాది ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మారక సభను జయప్రదం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాయిబాబా మరణం సహజ సిద్ధమైంది కాదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న సాయిబాబా పదేళ్లుగా భయంకరమైన జైలు శిక్షను అనుభవించాడని, సామాన్యుల పరిస్థితి మరెంత దారుణంగా ఉంటుందో ఊహించాలన్నారు. ప్రశ్నించే గొంతుకలను భౌతికంగా నిర్మూలించాలనే కుట్రను కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా కొనసాగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరిలో భాగంగానే ప్రస్తుతం అనేక మంది మేధావులు, కవులు, రచయితలు జైల్లో నిర్బంధించబడ్డారని తెలిపారు. నవంబర్ 3న నిర్వహించే సాయిబాబా స్మారక సభను విజయవంతం చేయడానికి విద్యార్థులు, మేధావులు, కార్మికులు ప్రతి ఒక్కరూ తరలి రావాలన్నారు. కార్యక్రమంలో కవి, రచయిత లక్ష్మణ్‌గౌడ్, అరుణ్‌కుమార్, వల్లభాపురం జనార్దన్, ఖాజమైనోద్దీన్, శ్రీదేవి, రాజేశ్వరి, వామన్‌కుమార్, కేసీ వెంకటేశ్వర్లు, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి


సుంకేసుల నుంచి దిగువకు పారుతున్న వరద నీరు

ఆత్మకూర్/ రాజోళి: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. గురువారం ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, దిగువలోని 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 593.024 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు.

సుంకేసులకు భారీ వరద

సుంకేసుల డ్యాంకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. గురువారం ఎగువ నుంచి 1,18,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అధికారులు 28 గేట్లు ఎత్తి 1,15,736 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర చెప్పారు.



● పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే! వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే! అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి. అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..


శివాని నేత

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకురాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్ ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్లభామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్



ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.

– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ

స్త్రీ శక్తి


మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సైన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.


రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై-రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ


బాల త్రిపుర సుందరి





అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.

పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.





– వీఎమ్‌ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్

హెల్దీ డైట్

సూజీ బ్రెడ్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటి సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుందనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని చాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.